11122024-MAI-04_Layout 1 12/11/2024 1:53 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

పని ఒత్తిడి మహమ్మారి

ఢిల్లీలోని బొటిక్ సేవల స్టార్టప్ కంపెనీ 'యెస్ మేడమ్' పేరు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతున్నది. పని ఒత్తిడికి గురవుతున్నట్టు అభ్యర్థించిన కొందరు ఉద్యోగులను తొలగించినట్టు వార్తలు వ్యాపించాయి. దీంతో ఆ వివాదం ముదిరిందని గమనించిన సదరు కంపెనీ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. 'ఎవరినీ తొలగించలేదని, కొంతకాలం పాటు విరామం మాత్రమే' అని వివరణ ఇచ్చింది. దీంతో, ప్రైవేటు ఉద్యోగుల పని పరిస్థితులు ఒక్కసారిగా దేశవ్యాప్తంగా చర్చకు వచ్చాయి. నేడు పని ఒత్తిడి అనే సమస్య ప్రపంచవ్యాప్త మహమ్మారిలా మారిపోయింది. ఉద్యోగులు ఎదుర్కొనే శారీరక, మానసిక సమస్యలకు పని ఒత్తిడే కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'నిరంతరం అందుబాటులో ఉండటం' అనే సూత్రం ఈ రోజుల్లో తప్పనిసరైంది. ఒక సర్వే ప్రకారం ప్రతి పది మందిలో తొమ్మండుగురికి పని గంటల వెలుపల ఆఫీసు ఫోన్లు వస్తున్నాయి. ఆ కాల్స్ ఎత్తకపోతే ప్రమోషన్లు నిలిపివేయడం వంటి సమస్యలు ఎదురైనట్టు 79 శాతం మంది చెప్పారు. దీని పర్యవసానంగా వ్యక్తిగతమనేది కుంచించుకుపోతున్నది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురిలో ఒకరు పని ఒత్తిడి వల్ల చతికిలపడుతుంటే ఆసియాలో మాత్రం వారి సంఖ్య ప్రతి ముగ్గురిలో ఒకరుగా ఉండటం బాధాకరం. పని చేసే వయసులో ఉన్న 15 శాతం మంది వయోజనులు మానసిక సమస్యలతో బాధపడుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక తెలియజేసింది.

ఉద్యోగుల్లో మానసిక సమస్యల వల్ల ఏటా ప్రపంచవ్యాప్తంగా 1200 కోట్ల పనిదినాలు వ్యర్థమవుతున్నాయి. తద్వారా రూ.80 లక్షల కోట్ల పైచిలుకు నష్టం వాటిల్లుతున్నది. ఆర్థిక సరళీకరణల అనంతర కాలంలో హక్కులు, యూనియన్లు బలహీనపడిపోవడం ప్రస్తుత పరిస్థితులకు ప్రధాన కారణం. ఉద్యోగ భద్రత అనేది ఉల్లిపొరలా పలుచనైంది. ఈ నేపథ్యంలోనే ఉద్యోగ భారం ఉసురు తీస్తున్నది. లక్ష్యాలు అందుకోవడం కోసం తీసే పరుగుల్లో అలసిసొలసి అసువులు బాసే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. బహుళజాతి దిగ్గజ సంస్థ 'ఎర్నెస్ట్ అండ్ యంగ్'లో పనిచేస్తున్న 26 ఏండ్ల యువతి పని ఒత్తిడి కారణంగా ఇటీవల మరణించిందన్న వార్త సంచలనమైంది. నిజానికి ఈ తరహా మరణాలు లెక్కల్లోకి ఎక్కవన్నది తెలిసిందే.

ఓ వైపు ఈ సమస్యకు పరిష్కారం కనుగొనడంపై ఆరోగ్య, సామాజికరంగ నిపుణులు బుర్రలు బద్దలు కొట్టుకుంటుంటే ఇన్ఫోసిస్ నారాయణమూర్తి మాత్రం పనిగంటలు పెంచాలని బాంబు పేలుస్తున్నారు. వారానికి 48 గంటల పని సమయంతోనే తిప్పలు పడుతుంటే ఆయన ఏకంగా 70 గంటలకు పెంచాలని సూచించడం విడ్డూరం. ఈ ఆచరణ సాధ్యం కాని ప్రతిపాదనల మాట అలా ఉంచితే తక్షణం కావాల్సింది ఉద్యోగుల సంక్షేమం. ఉద్యోగం చేయడానికి బతుకుతున్నామో లేక బతికేందుకు ఉద్యోగం చేస్తున్నామో తెలియని విషమ వలయంలో వారు ఊగిసలాడుతున్నారు. వీలైనంత త్వరలో పని పరిస్థితులు చక్కదిద్ది బతుకుపై భరోసా కల్పించాల్సిన అవసరం ఉన్నది. ప్రాజెక్టులు, కాంట్రాక్టుల విషయంలోనే కాదు, ఉద్యోగుల సంక్షేమం విషయంలోనూ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం అభిలషణీయమే.

తెలంగాణ 'తల్లి'పై కుట్రల రాజకీయమా?

దుర్గం రవీందర్
93464 54912

కాంగ్రెస్ ప్రభుత్వం పట్టుబట్టి మరీ 'తెలంగాణ తల్లి' కొత్త విగ్రహాన్ని ప్రతిష్ఠించింది. సోమవారం సాయంత్రం సచివాలయంలో వేలాదిమంది మహిళల సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. సచివాలయ ప్రధాన ద్వారం ఎదురుగా ప్రభుత్వం ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. అయితే, కాంగ్రెస్ పార్టీ రూపొందించిన కొత్త విగ్రహం తెలంగాణ తల్లి కాదని, కాంగ్రెస్ తల్లి అని బీఆర్ఎస్ తీవ్రంగా విమర్శించింది. అంతేకాదు, కావాలంటే ఆ విగ్రహాన్ని గాంధీభవన్‌లో ప్రతిష్ఠించుకోవాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వానికి సూచించారు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఇప్పటివరకున్న విగ్రహం తెలంగాణ తల్లి వలె లేదని, దేవత లాగా ఉన్నదనే బలహీన వాదన వినిపించారు.

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ స్పృహను మరిపించడానికి పరాయి పాలకులు అన్నిరకాలుగా ప్రయత్నించారు. దానికి విరుగుడుగా తెలంగాణ తల్లి ఆవిర్భవించింది. మేధావులు, కవులు, కళాకారులు యోచించి, చర్చించి తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక, సామాజిక నేపథ్యంలోంచి ఉద్యమ అవసరంగా 2007లో తెలంగాణ తల్లి రూపాన్ని తీర్చిదిద్దుకున్నాం. ఆ రూపాన్ని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం అనవసరం.

తెలంగాణ తల్లి కొత్త విగ్రహం పలు వివాదాలు, ఆరోపణలకు గురై రాజకీయ ఉపకరణంగా మారింది. తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడంపై బీఆర్ఎస్ మొదటి నుంచీ విమర్శిస్తూనే వస్తున్నది. మతపరమైన భావనలు పుష్కలం గా ఉండే ఎంఐఎం దేవతలను, అమ్మలను విగ్రహాలుగా పెట్టడాన్ని ఎలాగూ ఆమోదించదు. ఇక బీజేపీ నేతలు తమాషా చూసే ధోరణిని అవలంబిస్తున్నట్టుగానే కనిపిస్తున్నది. సగటు తెలంగాణ అమ్మ, సాధారణ మహిళ రూపంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రేవంత్ రెడ్డి ఆవిష్కరించగా, అందుకు పోటీగా మేడ్చల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు మునపటి తెలంగాణ తల్లి విగ్రహాన్నే మళ్లీ తాజాగా ఆవిష్కరించారు.

ఉద్యమ సమయంలో రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహంలో రాచరికపు ఆనవాళ్లున్నాయని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఆరోపించింది. గతేడాది డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ వెంటనే తెలంగాణ తల్లి విగ్రహ రూపు మార్చడంపై దృష్టిపెట్టింది. విగ్రహం ఎలా ఉండాలనే దానిపై అందుబాటులో ఉన్న తమ పార్టీ అనుకూలురతో సమాలోచనలు జరిపి కొత్త విగ్రహాన్ని రూపొందించింది. ఈ నేపథ్యంలో 'దేవత వరాలు ఇస్తుంది, అమ్మ ఆకలి తీరుస్తుంది. ఈ తల్లి మన అమ్మకు ప్రతిరూపం' అని కొత్త విగ్రహంపై వస్తున్న విమర్శలపై సీఎం రేవంత్ వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. 'ఈమె అమ్మ, ఆమె దేవత. దేవత కన్నా అమ్మే గొప్ప' అనే అర్థం వచ్చేటట్టు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు. కానీ, ఇది రాజకీయ ఉద్దేశంతో చేసిన ప్రతిచర్య తప్ప ఇందులో ఔచిత్యం అంతగా లేదు.

> **పరిపాలనలో తమ ముద్ర ఉండాలని పాలకులు అనుకోవడం సహజమే. కానీ, ఉన్నవాటిని తుడిచి తమ ముద్ర వేసుకోవడం వర్తమాన ప్రజాస్వామికపు రోజుల్లో సబబు కాదు. చివరికి ఇది కాంగ్రెస్, బీఆర్ఎస్ గొడవగా, ఇంకా పిండితార్థం తీస్తే కులాల గొడవగా మార్చారు.**

'తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం మూర్ఖత్వం. సీఎం తల తిక్క ఆలోచనలతో తెలంగాణ అస్తిత్వాన్ని గాయపరుస్తున్నారు. తెలంగాణ అస్తిత్వం, ప్రజల ఆకాంక్షల గురించి తెలియని రేవంత్‌రెడ్డి.. రాజకీయ స్వార్థంతో, నా మీద కక్షతో పిచ్చి పనులకు పూనుకొంటున్నారు' అని కేసీఆర్ అన్నారు.

> **నిజానికి, తెలంగాణ తల్లి భావన కేసీఆర్ ఒక్కరిది కాదు, యావత్ తెలంగాణ సమాజానిది. ఈ మాటను కేసీఆర్ కూడా స్పష్టం చేశారు. అయితే, ఆ భావనకు రూపం ఇచ్చే పనికి మాత్రమే కేసీఆర్ పూనుకున్నారు. కేసీఆర్ ఆహ్వానం మేరకు కొందరు తెలంగాణ ఆలోచనాపరుల సూచన ప్రకారం... ప్రొఫెసర్ తోమారపు గంగాధర్ తెలంగాణ తల్లి విగ్రహానికి తుది రూపునిచ్చారు.**



కేసీఆర్ పెట్టిండని విగ్రహరూపు మార్చాలనుకోవడం సబబు కాదు. తెలంగాణను ఆంధ్రాలో కలుపుకోవాలనే కుట్రలో భాగంగా ఆంధ్రా మాతను పక్కనబెట్టి తెలుగుతల్లిని నాడు పరాయి పాలకులు తెరమీదికి తెచ్చారు. అయితే, 70 ఏండ్ల కిందటనే దాశరథి, రావెళ్ల వెంకట్రామారావు వంటి కవులు, తెలంగాణ తల్లి భావనను చిక్కబరిచారు, ప్రచారంలోకి తీసుకువచ్చారు. భాషాప్రయుక్త రాష్ట్రాల పేరిట తెలంగాణ, ఆంధ్రా విలీనానికి ముందే 'నా తెలంగాణ తల్లి కంజాతపల్లి' అని దాశరథి అనగా.. 'నా తల్లి తెలంగాణరా.. వెల లేని నందనోద్యాన మ్ముర' అని రావెళ్ల వెంకట్రామారావు అన్నారు. కాకతీయుల కాలం నాటి మూలాలతో సాంస్కృతిక అస్తిత్వ భావనలు ప్రతి తెలంగాణ పౌరుడిలో నిక్షిప్తమై ఉంటాయి. వారందరి ఆకాంక్షల ఫలితమే తెలంగాణ తల్లి. ప్రజల్లో తెలంగాణ స్పృహను పెంచి వారిలో ఐక్యతను పెంచడానికి తెలంగాణ తల్లి భావన అవసరమైంది. ఉద్యమ కాలంలో తెలంగాణ అస్తిత్వానికి ఒక ప్రతీక అవసరమై, దానికొక పవిత్రతను ఆపాదించడానికి ఒక రూపం కావాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోంచే తెలంగాణ తల్లి రూపుదిద్దుకున్నది. అయితే, ప్రస్తుత పాలకులు అల్పమైన తాత్కాలిక ప్రయోజనాల కోసం ఈ విషయాన్ని రాజకీయం చేస్తున్నారు.

'మా తెలుగు తల్లికి మల్లెపూ దండా' అని తెలంగాణ పిన్న పెద్దలతో పరాయి పాలకులు పాడించారు. కానీ, వట్టికోట ఆళ్వారుస్వామి, కాళోజీ నారాయణరావు, పల్లా దుర్గయ్య, సురవరం ప్రతాపరెడ్డి లాంటి వారు ఆంధ్రా వేరు, తెలంగాణ వేరు అనే స్పృహతో పని చేశారు. ఆ స్పృహ చిక్కబడి తెలంగాణ ఉద్యమమైంది. ఉమ్మడి రాష్ట్రంలో రెడ్ల ప్రాబల్యం ఉన్న కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు వారు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో మనస్ఫూర్తిగా పాల్గొనలేదు.

కవులు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు, ఉపాధ్యాయ, ఉద్యోగులు తెలంగాణ ఉద్యమానికి బాసటగా నిలిచారు. భాష, యాసలు, సంస్కృతి, చరిత్ర, అస్తిత్వాల పట్ల తమ కవిత్వం, రచనలు ఆటపాటల ద్వారా ప్రజల్లో ఉద్యమం పట్ల అవగాహన పెంచారు. భావజాలాన్ని వ్యాప్తిజేశారు. ఆ క్రమంలో తెలంగాణ తల్లి రూపుదిద్దుకున్నది.

మలిదశ ఉద్యమ సమయంలో తెలంగాణ అస్తిత్వ చేతన బలంగా ముందుకువచ్చింది. తెలంగాణ ప్రజల్లో అస్తిత్వ భావనకు ఊపిరిపోసింది. అప్పుడే తెలుగు తల్లిని 'ఎవడి తల్లి దిక్కుమాలిన తల్లి' అని ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఈసడించుకున్నారు. 'మా తల్లి మాకు ఉంటుంది. మా తల్లి తెలంగాణ తల్లి' అని అన్నారు. గిరిజనుల్లో పొలానికి, పశువుల పాకకు, పురిటిగడ్డకు కూడా దేవత ఉంటుంది. తెలంగాణ గ్రామాల్లో ఇంటికో మైసమ్మ, ఊరికో ఊరడమ్మ, చెరువుకో కట్ట మైసమ్మ, కోటకో కోట మైసమ్మ ఉంటుంది. అన్ని శుభకార్యాల్లో నేటికీ తొలి పూజలు వీరికే అందుతాయి. అటువంటిది నాలుగు కోట్ల మందికి, రెండు కోట్ల చదరపు కిలోమీటర్ల ప్రాంతానికి తల్లి ఎందుకు ఉండొద్దనే ఉద్దేశం నుంచే తెలంగాణ తల్లి ఆలోచన పుట్టింది. ఎల్లమ్మకు ప్రతీకగా గవ్వలు చలామణిలో ఉన్నాయి. సమ్మక్క-సారలమ్మలకు ప్రతీకగా కుంకుమ భరిణని భావిస్తున్నాం. శంఖుచక్రాలను విష్ణుమూర్తిగా కొలుస్తాం. అలాగే తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక తెలంగాణ తల్లి.

> **'ఒక ప్రాంత ప్రజల అస్తిత్వానికి చిహ్నంగా ఉండాల్సిన తల్లి రూపం దివ్యంగా, భవ్యంగా, భగవత్ స్వరూపంగా ఉండాలె. ప్రజలు చూడగానే చేతులెత్తి నమస్కరించుకునేలా ఉండాలె' అని బీఆర్ఎస్ నేతలు మొదటి నుంచీ చెప్తున్నారు.**

కొత్త విగ్రహావిష్కరణ గొప్ప నిర్ణయమని ప్రభుత్వం అంటున్నది. నాలుగు కోట్ల ప్రజల ఆలోచన కొత్త తల్లి అని సీఎం చెప్తున్నారు. అంతే కాదు, దయచేసి రాజకీయాలకతీతంగా తెలంగాణ తల్లి రూపాన్ని ఆమోదిద్దామని అన్నారు.

> **కానీ, పాత ప్రభుత్వం తీసుకున్న అన్ని నిర్ణయాలను తిరగదోడుదామనేది మంచి సంప్రదాయమైతే కాదు. ఇది అలవాటుగా మారితే ప్రభుత్వం మారిన ప్పుడల్లా ఈ మార్పులు ప్రధాన వ్యాపకాలు అయిపోతాయి. పాత వారి ఆనవాళ్లు లేకుండా చేస్తామనే తలంపు మంచిది కాదు. సరికొత్త ఆలోచనలు, ప్రజారంజక పాలనా పద్ధతులతో చరితార్థులు కావాలె కానీ, ఇలా చేయడం రాజకీయం తప్ప మరేమీ కాదు.**

కాంగ్రెస్ పాలనలో ఎవుసం ఆగమాగం

మూడ్ శోభన్
99497 25951

2023, డిసెంబర్ 7న రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు తన మ్యానిఫెస్టోలో రైతులకు అనేక వాగ్దానాలు చేసింది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.2 లక్షల రైతు రుణమాఫీ, రైతులతో పాటు, కౌలు రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి సాయం, రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు, అన్ని పంటలకు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయడం, ప్రత్యేకించి వడ్లకు బోనస్ వాటిలో ప్రధానమైనవి. అంతేకాదు, ఈ హామీలన్నింటిని ఏడాదిలోపే పూర్తి చేస్తామని, అందుకనుగుణంగా ఒక్కో హామీ అమలుచేసే తేదీలను కూడా కాంగ్రెస్ ప్రకటించింది. కానీ, నేడు వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

గద్దెనెక్కిన వెంటనే రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ఆ తర్వాత మాటమార్చింది. ఆగస్టు 15లోగా రుణమాఫీ పూర్తి చేస్తామని మరో గడువు విధించింది. కానీ, ఆగస్టు 15 నాటికి 22,07,067 మంది రైతులు తీసుకున్న రూ.17,869.20 కోట్ల రుణాలనే మాఫీ చేసింది. ఆ తర్వాత 2024 నవంబర్‌లో 2.80 లక్షల మంది రైతుల రూ.2,860 కోట్ల రుణాలను మాఫీ చేసింది. అయితే, ప్రభుత్వ అంచనా ప్రకారం.. 41 లక్షల మంది రైతులు తీసుకున్న రూ.31 వేల కోట్ల పంట రుణాలను మాఫీ చేయాలి. ఈ లెక్కన మాఫీకి నోచుకోని రైతులు ఇంకా లక్షల్లో ఉన్నారు. 2024-25కు సంబంధించి బ్యాంకర్ల కమిటీ పంట రుణాల కింద రూ.81,477.09 కోట్లు కేటాయించినప్పటికీ, వానకాలంలో రూ.27,485 కోట్లు మాత్రమే బ్యాంకులు పంట రుణాలిచ్చాయి. దీంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తున్నది.

2018లో రైతుబంధును ప్రవేశపెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 వానకాలం నాటికి 65 లక్షల మంది రైతులకు రూ.79,714.49 కోట్ల పెట్టుబడి సాయం అందజేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం 2023-24కు యాసంగికి 69.86 లక్షల మందికి రూ.7,625.75 కోట్లు చెల్లించింది. కానీ, 2024-25 వానకాలం సీజన్ రైతుబంధును ఎగ్గొట్టి అన్నదాతల నడ్డి విరిచింది.

మద్దతు ధర చెల్లించి అన్ని పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పిన కాంగ్రెస్.. ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడం శోచనీయం. అది కూడా తేమ, నాణ్యతా ప్రమాణాలను సాకుగా చూపుతూ క్వింటాలుకు 5 కిలోల వరకు కోత పెడుతున్నారు. మార్కెట్‌కు ధాన్యం తీసుకెళ్తే 10 రోజుల వరకు అక్కడే నిరీక్షించాల్సి వస్తున్నది. ప్లాట్‌ఫామ్, టార్పాలిన్లు అందుబాటులో లేవు. ధాన్యం డబ్బులు సమయానికి అకౌంట్లలో జమకావడం లేదు. ఈ నేపథ్యంలో మార్కెట్ యార్డుల అభివృద్ధికి కనీసం రూ.500 కోట్లు కేటాయించాలి. మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా మద్దతు ధరపై వరికి రూ.500, మక్కజొన్నకు రూ.330, కందులకు రూ.400, సోయాకు రూ.450, పత్తికి రూ.475, జొన్నలకు రూ.292 బోనస్ ఇవ్వాలి. అంతేకాదు, క్వింటాలుకు మిరప రూ.15 వేలు, పసుపు రూ.12 వేలు, ఎర్రజొన్న రూ.3,500, చెరుకు రూ.4 వేలు చొప్పున కొనుగోలు చేయాలి. ఇచ్చిన హామీకి విరుద్ధంగా సన్నాలకు మాత్రమే ప్రభుత్వం బోనస్ ఇస్తున్నది. మొత్తం వడ్లలో ఈ రకం 30 శాతమే. తద్వారా చాలా మంది రైతులు బోనస్ నష్టపోతున్నారు.

> **ఈ ఏడాది తుఫాన్ కారణంగా 5 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామని పాలకులు ప్రకటించారు. కానీ, రూ.95.38 కోట్లు మాత్రమే విడుదల చేయడం విడ్డూరం. దేశంలోని 14 రాష్ట్రాలకు రూ.5,858.60 కోట్లను కేటాయించిన కేంద్రం.. తెలంగాణకు రూ.416.80 కోట్లు మాత్రమే కేటాయించింది. ఎకరాకు కనీసం రూ.20 వేలు సహాయం అందించాలి.**

ప్రజా పాలనలో వచ్చిన 1.28 కోట్ల దరఖాస్తుల్లో 70 లక్షల వరకు భూ సమస్యలకు సంబంధించినవే. వాటిని పరిష్కరించేందుకు 20 రోజుల పాటు ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ కార్యక్రమం నిర్వహించింది. కానీ, సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు.

లక్షల మంది రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాలు, సివిల్ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి, వాస్తవ సాగుదారులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలి. కౌలుదారులకు హక్కులు కల్పించాలి. రాష్ట్రానికి వ్యవసాయ ప్రణాళికను రూపొందించాలి. తెలంగాణను దిగుమతుల్లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలి. రాష్ట్రంలో హార్టికల్చర్ విస్తీర్ణం 12 లక్షల ఎకరాల నుంచి 25 లక్షల ఎకరాలకు పెరిగింది. కానీ, హార్టికల్చర్, పామాయిల్‌కు రూ.227.38 కోట్లు మాత్రమే కేటాయించారు. రాష్ట్రంలో నకిలీ విత్తన వ్యాపారం జోరుగా సాగుతున్నది. దానివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు సంస్థాగతంగా, చట్టపరంగా చర్యలు చేపట్టాలి.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన అన్ని హామీలను నెరవేర్చాలి. ప్రధానంగా రైతుల ఆత్మహత్యల నివారణకు కౌలుదారులకు చట్టపరమైన రక్షణ కల్పించాలి. 65 ఏండ్లు దాటిన రైతులకు పింఛన్ ఇవ్వాలి. రైతు బీమా అర్హత వయస్సును 18-70 ఏండ్లకు పెంచాలి. జిల్లా స్థాయిలో అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలి.

కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాణ్యమైన, ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో గురుకులాలను వెయ్యికిపైగా పెంచింది. అంతేకాదు, మైనారిటీల కోసం 200కు పైగా గురుకులాలను స్థాపించి ఆ వర్గం విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషిచేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో కొత్త పోస్టులను మంజూరుచేసి పటిష్ఠం చేసింది.

గురుకులాలకు 'రేవంత్' గ్రహణం

శ్రీశ్రీ కుమార్

గత పదేండ్లుగా గురుకులాల్లో చదివిన విద్యార్థులు ఇప్పుడు ఐఐటీయన్లుగా, డాక్టర్లుగా ఎదిగారు. ఉన్నత చదువుల కోసం, ఉద్యోగ రీత్యా చాలామంది విదేశాలకు వెళ్లడం కూడా మనకు అనుభవమే. గురుకుల విద్య కారణంగా అనేక కుటుంబాల్లో మొదటితరం విద్యార్థులు పైలట్లుగా, సైనికాధికారులుగా రాణిస్తుండటం విశేషం. కేసీఆర్ దూరదృష్టే వారిని ఆ స్థాయికి చేర్చింది. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ లాంటి అణగారినవర్గాల కోసం 50కి పైగా డిగ్రీ కళాశాలలను నెలకొల్పిన కేసీఆర్ సర్కార్ వేల మందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దింది. పేదలకు అందని ద్రాక్షగా ఉన్న న్యాయవిద్యను సైతం గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. పేదలు న్యాయమూర్తులు అవ్వాలనే గొప్ప సంకల్పంతో కేసీఆర్ న్యాయ కళాశాలను ఏర్పాటు చేయటం దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన విషయం.

> ***కేసీఆర్ హయాంలో గురుకులాల్లో అడ్మిషన్లకు ఎంతో డిమాండ్ ఉండేది. నాడు సంక్షేమ గురుకులాలు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించాయి. దశాబ్ద కాలంలో గురుకులాలు ఎంతో వైభవానికి నోచుకుని, ఎన్నో అద్భుతాలు సృష్టించాయి. ఇది గురుకులాలపై కేసీఆర్ వేసిన చెరగని ముద్ర.***

కేసీఆర్ పాలనలో ఎవరెస్ట్ కన్నా ఉన్నత స్థితిలో ఉన్న గురుకులాలు నేడు అగాథంలోకి కూరుకుపోయాయి. సంబంధిత మంత్రులు లేకపోవడంతో వాటి ఆలనాపాలనా కరువైంది. అందుకే ఏడాదిలో దాదాపు 50 మంది విద్యార్థులు మరణించారు. ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి, అసమర్థతకు ఇది నిదర్శనం. వరుస మరణాలు ఇటు తల్లిదండ్రులను, అటు విద్యార్థులను కలచివేస్తున్నాయి. సహచరులు తనువు చాలిస్తుండటంతో విద్యార్థులు కూడా మానసికంగా కుంగిపోతున్నారు.

గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు నిత్యకృత్యమైపోయాయి. రాష్ట్రంలో ఏదో ఒక పాఠశాలలో, హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ అవడం, విద్యార్థులు రోడ్లెక్కడం ఆనవాయితీగా మారింది. ఉస్మానియా, కాకతీయ హాస్టళ్లలోనూ ఇదే తంతు. ఈ సంఘటనలపై ప్రభుత్వ పెద్దలు ఇస్తున్న సమాధానాలు, చేస్తున్న ఆరోపణలు అసంబద్ధంగా ఉన్నాయి. ఈ విషయం తల్లిదండ్రులకు కూడా అర్థమవుతున్నది. అందుకే వారు 'గురుకులాలకు రేవంత్ గ్రహణం పట్టింద'ని వాపోతున్నారు.

రాష్ట్రంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పర్యటనల్లో భాగంగా పాఠశాలలు, హాస్టళ్లలో శుభ్రత పాటించకపోవడాన్ని గుర్తించి, అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. 'ఆడ లేక మద్దెల ఓడు' అన్నట్టు తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్ పార్టీని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను నిందించడం నిర్హేతుకం. ఇది విద్వేషంతో కూడి విష ప్రచారమే.

ఇప్పటికైనా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాలను గుర్తించాలి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న తప్పులను తెలుసుకొని వాటిని సరిదిద్దాలి. గత కేసీఆర్ ప్రభుత్వంపై విద్వేషపూరిత ప్రసంగాలు, విష ప్రచారాలను మానుకొని, గురుకులాల్లో దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. గత ప్రభుత్వ హయాంలో పేరు ప్రఖ్యాతులు గడించిన గురుకులాలను మరింత బలోపేతం చేయాలి. 400 మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ఇన్ని సమస్యలు వస్తుంటే ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరిట ఒకేచోట 2,500 మంది విద్యార్థులకు మూడు పూటలా ఆరోగ్యకరమైన భోజనం అందించడం ఎంత కష్టమో గుర్తెరగాలి. గత ప్రభుత్వంపై అక్కసుతో గురుకుల విద్యను నీరుగారుస్తూ ఆర్భాటంగా మొదలుపెడుతున్న సమీకృత గురుకుల పాఠశాలలు మరిన్ని సమస్యలకు నిలయాలుగా మారుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. కాబట్టి, వాటిపై కోట్ల రూపాయలు వెచ్చించడం కన్నా, ఉన్న గురుకులాలను బాగు చేసుకోవడమే మంచిది. ఆ సొమ్ముతో మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన, ఉచిత విద్యను బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు అందించవచ్చు. తద్వారా గురుకులాలకు పూర్వ వైభవం సంతరించుకుంటుంది.



ఈసీతో బీజేపీ కుమ్మక్కు!

బీజేపీతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కైంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆప్ సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తున్నది. ఆర్‌కే పురం నియోజకవర్గంలో 3800 మంది ఓట్లను తొలగించేందుకు దరఖాస్తులు రాగా.. వారిలో 1800 మంది ఇప్పటికీ బతికే ఉన్నట్టు క్షేత్రస్థాయి పరిశీలనలో మాకు తెలిసింది. అంతేకాదు, వారంతా అదే ప్రాంతంలో నివసిస్తున్నట్టు తేలింది.

- సంజయ్‌సింగ్, ఆప్ సీనియర్ నేత